క్లుప్తంగా

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బేబీ

నందికొట్కూరు: వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటునట్లు మున్సిపల్ కమిషనర్ బేబీ స్పష్టం చేశారు. గురువారం మండల పరిధిలోని మల్యాల వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు వేసవి కాలంలో తాగు నీటి సమస్యలు రాకుండా కేసీ కెనాల్ నుంచి రెండు మోటార్ల ద్వారా సమ్మర్ స్టోరేజిలోకి పంపింగ్ చేస్తునట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంట డీఈ నాసీర్, ఏఈ దినేష్‌కుమార్, సిబ్బంది మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా యజ్ఞం



గీతా యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామం నాగసాయి ఆశ్రమంలో గురువారం రామానంద స్వామి ఆధ్వర్యంలో గీతా యజ్ఞం ఘనంగా నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన గురు సిద్దేశ్వర స్వామి ముఖ్య అతిథులుగా హాజరై అనుగ్రహ సంభాషణ చేశారు. కృష్ణం వందే జగద్గురుం అని ప్రజలు గ్రహించాలని గీతాచార్యుని భోదనలు గ్రహించాలని తెలిపారు. ఫలం ఆశించకుండా మంచి కర్మలు చేయాలని చెప్పారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, బీజేపీ రాష్ట్ర నాయకులు చల్లా దామోదర్‌రెడ్డి, చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలకు అన్ని రకాల సేవలు అందజేస్తాం

నందికొట్కూరు: ప్రజల ముంగిటకే పాలన అందించేందుకు నూతన సచివాలయం, హెల్త్ కేంద్రం ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో సచివాలయం, హెల్త్ కేంద్రం, వడ్డేమాన్ గ్రామంలో సచివాలయం ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానంద రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు గ్రామంలోనే మెరుగైన సేవలు అందించేందుకు నూతన భవనాలను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, మల్యాల ఎంపీటీసీ యశోధ, వడ్డేమాన్ సర్పంచ్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిల్, నాటుసారాను చూపుతున్న ఎక్సైజ్ సీఐ, పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని సిద్దాపురం గ్రామ సమీపంలో మోటార్ సైకిల్‌పై నాటుసారాను తరలిస్తున్న మాణిక్యాల మహేష్, మాణిక్యాల ప్రతాప్‌లను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్.కిషోర్‌కుమార్ గురువారం తెలిపారు. సదరు వ్యక్తుల నుంచి మోటార్ సైకిల్, 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. నాటుసారా తయారీ, అక్రమ మద్యం సరఫరా చేసే వారి వివరాలు తెలిస్తే తన సెల్ నం. 94409 02585, 91772 99067, 83283 07774 నంబర్‌లకు సమాచారం అందించాలన్నారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది బాదుల్లా, రామచంద్రుడు, కృష్ణుడు,తిక్కయ్య, రామకృష్ణుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పాములపాడు: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. గురువారం స్థానిక సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మండలప్రత్యేకాధికారి రాజు, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుప్రజ, ఆర్ఐఖాజాబీ, సర్వేయర్ కలిముల్లా, వీఆర్వోలు శివన్న, ముర్తుజావలి, రాము, పురంధరుడు, వెంకటేశ్వర్లు, దేవదాయ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పైప్ లైన్ లీకేజీకి మరమ్మతులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీలోని ప్రధాన రహదారిలో పైప్ లైన్ లీకేజీ కావడంతో సర్పంచ్ వరప్రసాదరావు గురువారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పైపు లైన్ లీకవ్వడంతో నీరు వృథాతో పాటు రహదారి బురద మయం అయ్యిందన్నారు. దీంతో మరమ్మతులు చేయించామని చెప్పారు.

గిట్టుబాటు కాని వ్యవసాయం!

- ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న పంటలు
- వచ్చిన అరకొర దిగుబడులకు గిట్టుబాటు ధర కరువు
- ఆదుకోని ప్రభుత్వం
- నష్టాల పాలవుతున్న అన్నదాతలు
- రైతులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్ ముట్టడి



ఆత్మకూరు సమీపంలో రైతులు ఆరబోసిన వరి

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటల సీజన్లలో అన్నదాతలకు నష్టాలే మిగిలాయి. ఓవైపు వర్షాలు, మరోవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు మద్దతు ధర కల్పించాలని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ రోడెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. పంటకు మద్దతు ధర కల్పించాలని బండి ఆత్మకూరు మండలంలో గతవారం రైతులు రోడ్డుపై నిరసన తెలియజేశారు.

60 వేల ఎకరాలకు పైగా వరి పంటసాగు

శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, మహానంది, బండి ఆత్మకూరు మండలాల్లో పంటలను 60 వేల ఎకరాలకు పైగా రైతులు విస్తారంగా వరి పంటను సాగుచేశారు. ప్రధానంగా తెలుగుగంగ, కె.సి.కెనాల్, చెరువుల కింద ఈ పంటలను వేశారు. శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరులో 14 వేల ఎకరాలు, వెలుగోడు మండలంలో 19 వేల ఎకరాలు, బండిఆత్మకూరు మండలంలో 29 వేల ఎకరాలు, మహానంది మండలంలో 16 వేల ఎకరాలకు పైగా వరి పంటను వేశారు. ఈ పంటలకు తోడుగా ఖరీఫ్‌లో మొక్కజొన్న దాదాపుగా డివిజన్‌లో 30 వేల ఎకరాలకు పైగా, 9 వేల ఎకరాల్లో మినుము పంటలను రైతులు సాగుచేశారు. అలాగే కంది, పొగాకు, పత్తి పంటలను కూడా రైతులు వేసుకున్నారు.

మద్దతు ధర లేక రైతన్నలకు కన్నీరు

గతేడాది రైతులు సాగుచేసిన వరి పంటకు బస్తా (70 కిలోలు) ధర రూ.2700 నుంచి రూ.3 వేల దాకా అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం 0 కిలోల బస్తా వరి ధాన్యం ధర కేవలం రూ.1,300 నుంచి రూ.1,450 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఉన్నఫలంగా ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందే పరిస్థితి నెలకొంది. అలాగే గతేడాది మొక్కజొన్న క్వింటా రూ.1,900 నుంచి రూ.2,200 వరకు ధర పలికింది. ప్రస్తుతం ఇదే మొక్కజొన్న పంట వర్షాల దెబ్బకు దిగుబడి తగ్గింది. పంట సరిగా లేదని వ్యాపారులు కేవలం రూ.1,200 నుంచి రూ.1,350 లోపే కొనుగోలు చేస్తున్నారు. వీటికి తోడు ఉల్లి, టమాట, మిర్చి పంటల ధరలు కూడా తగ్గడంతో రైతులు నష్టపోయారు. ఎన్నడూలేని విధంగా పంటలు దెబ్బతినడం, మద్దతు ధర లేకపోవడంతో రైతులు వాపోతున్నారు.

పెరిగిన ఎరువుల ధరలు

ఈ ఏడాది పంటలకు కావాల్సిన రసాయనిక ఎరువులు, మందుల ధరలు విపరీతంగా పెరిగాయి. 14:35:14 రకం రూ.1,800కాగా , 20:20:013 మాత్రం రూ.1,300 ఉంది, యూరియా మాత్రం రూ.226 చొప్పున ధరలు ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే ఎరువుల ధరలు బస్తాకు రూ.100 నుంచి రూ.200 వరకు పెరిగింది. అప్పులకు వెళితే వ్యాపారులు బస్తాకు రూ.200 నుంచి రూ.400 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ

కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారికి అండగా నిలిచింది.

రైతులకు మద్దతు ధర కల్పించాలి



ఈ ఏడాది మొక్కజొన్న పంట వేశాను. అరకొరగా వరి కూడా వేశాను. రెండు పంటలు వేసినా నాకు నష్టమే మిగిలింది. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలే మిగిలాయి. ప్రభుత్వం స్పందించి మద్దతు ధరలో ధాన్యం కొనుగోలు చేయాలి. లేకుంటే అప్పుల పాలు కావాల్సిందే.

– నాగన్న, రైతు, దుద్యాల

ప్రకృతి కూడా సహకరించడం లేదు



రైతులకు ప్రకృతి కూడా సహకరించడం లేదు. అధిక వర్షాల కారణంగా మొక్కజొన్న, వేరుశనగ పంటలకు చీడపీడల బాధ అధికమయ్యింది. దీనికితోడు పంటలు ఏపుగా పెరగకుండా నష్టపోయే పరిస్థితి నెలకొంది. పెట్టుబడులు పెరిగిపోవడం, అరకొరగా వచ్చిన దిగుబడులకు మద్దతు ధర లేకపోవడంతో అప్పులే ముగులుతున్నాయి.

– వెంకటేశ్వరనాయక్, రైతు, ఎస్.ఎస్.తండా

అన్నదాతలకు అండగా శుక్రవారం నంద్యాల జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ, ధర్నా నిర్వహించనున్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నారు. కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు.

ప్రణాళిక లేకపోతే అభివృద్ధి శూన్యం



పగిడ్యాల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పాములపాడు ఎంపీడీఓ చంద్రశేఖర్

పగిడ్యాల: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే ప్రణాళిక ఉండాలని ప్రణాళిక లేకపోతే అభివృద్ధి శూన్యమని ఎంపీడీఓ సుమిత్రమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ పుల్యాల దివ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు ఐక్యరాజ్య సమితి 17 అంశాలను నిర్దేశించిందన్నారు. గ్రామ సర్పంచ్‌లు 21 అంశాలపై అధికారం కలిగి ఉంటారని, వార్డు సభ్యుల సమన్వయంతో గ్రామంలో చేపట్టబోయే మౌళిక సదుపాయాల కల్పనకు అవసరమగు నిధులను అంచనా వేయాలని వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఏఈలు శివకుమార్, జావేద్, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, కాసీం, లక్ష్మీనారాయణమ్మ, వీరన్నయాదవ్, కోట్ల వెంకటేశ్వర్లు , వీఆర్వోలు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు ముగిసిన శిక్షణ

బండి ఆత్మకూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు నిర్వహించిన పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై తరగతులు ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... ఆయా శాఖల అధికారులు తమ ముందున్న సవాళ్లను అధిగమించడానికి సరైన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి దోహదపడాలి

జూపాడుబంగ్లా: గ్రామాల అభివృద్ధికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు దోహదపడాలని ఎంపీడీఓ గోపికృష్ణ, ఎంపీపీ సువర్ణమ్మ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీపై అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు కల్పించాల్సిన మౌళిక వసతులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ముందుగా ఆయా గ్రామాల్లోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు మెంబర్లు ప్రజలతో గ్రామసభలు నిర్వహించి తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు పరస్పర సహకారంతో కృషి చేయాలని ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీడీఓ మేరి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో అధికారులు, సర్పంచులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పనిచేయాలన్నారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులే కీలకం

పాములపాడు:గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులే కీలకమని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి దోహదపడే 9 అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ2 సుభాషిణి దేవి, ఏఈ ఆర్‌డబ్ల్యుఎస్‌సువర్చల, ఏపీఎం ఉమామహేశ్వరి, ఏపీఓ విమలమ్మ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో భవిష్యత్తు నాశనం

మహానంది: తల్లిదండ్రులు బాలికల భవిష్యత్తు పట్ల తగిన శ్రద్ధ చూపాలని, చిన్న వయసులోనే వారికి వివాహాలు చేసి వారి భవిష్యత్తును పాడు చేయవద్దని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి తెలిపారు. తిమ్మాపురంలోని ఏపీ మోడల్ పాఠశాలలో కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ లీలావతి మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ పోషకాహారం తీసుకోవాలన్నారు. ఎవరైనా బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహమ్మద్ దౌలా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: నూతన సచివాలయం, నూతన హెల్త్ కేంద్రం ప్రారంభోత్సవాలకు ఆహ్వానించకుండా ఎలా ప్రారంభిస్తారని గ్రామ సర్పంచు తలారి ఉమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామంలో సచివాలయం, హెల్త్ కేంద్రం ప్రారంభోత్సవానికి ప్రొటోకాల్ ప్రకారం సర్పంచ్‌ను పిలవకుండా ఎమ్మెల్యే జయసూర్య ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. సర్పంచ్ బీసీ మహిళ కావడంతో కనీసం ఆహ్వానం కూడా అధికారులు ఇవ్వకుండా కించపరిచారని మండిపడ్డారు. తనకు ఆహ్వానం అందించకుండా ఎమ్మెల్యేతో ప్రారంభోత్సవం చేయించిన సంబంధిత అధికారులపై జిల్లా కలెక్టర్, సంబంధించిన శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వీడని మంచు!

మహానంది: సాధారణంగా చలికాలంలో తెల్లవారుజామున, అర్ధరాత్రి నుంచి మంచు కురుస్తుంది. అయితే వాతావరణంలో మార్పుల కారణంగా మహానందిలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు మంచు కురుస్తూనే ఉంది. మహానంది ఆలయ పరిసరాలతో పాటు సమీప గ్రామాల్లోనూ మంచు ఉండటంతో చలి కాస్త ఎక్కువగా అనిపించింది.



సాయంత్రం వేళ కురుస్తున్న పొగమంచు

నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తున్నందుకు నిరసనగా తమ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన నంద్యాలలోని జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమానికి శ్రీశైలం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలిరావాలన్నారు. ఉదయం 10 గంటలకు నంద్యాల పట్టణంలోని ఉదయానంద రెసిడెన్షియల్ సర్కిల్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వైఎస్సార్‌సీపీ తరఫున వినతి పత్రం అందించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

పగిడ్యాల: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షాన కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ శుక్రవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ కన్వీనర్ రమేష్‌నాయుడు గురువారం వారు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త దారా సుధీర్ పిలుపు మేరకు కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు అవుతున్నా సూపర్‌ సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు.

గొడవలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు



గ్రామసభలో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

పాములపాడు: అనవసర విషయాలకు గొడవలు పడి జీవితాలు నాశనంచేసుకోవద్దని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ హెచ్చరించారు. గురువారం రాత్రి మండలంలోని మిట్టకందాల గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య ఏదైనా ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి వాడకం మూలంగా ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిస్తే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలు సెల్ ఫోన్ వాడకం ఎక్కువైందని, తల్లి దండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాల్వ కాదిది!



కోనేరు నీరు బయటికి వచ్చే కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం

మహానంది: చిత్రంలో కనిపిస్తున్న కాలువ మురుగు కాల్వ అనుకుంటే పొరపాటే. మహానంది పుణ్యక్షేత్రంలోని కోనేరుల నుంచి బయటికి ప్రవహించే నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కాలువ. కోనేరు నుంచి నిరంతరం స్వచ్ఛమైన నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అయితే కొందరు వ్యాపారులు టీ కప్పులు వేయడం, భక్తులు ప్లాస్టిక్ బాటిళ్లు, పాత వస్త్రాలను పడేయడంతో కాలువలో పేరుకుపోయాయి. ఆలయ అధికారులు స్పందించి కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని మహానందీశ్వరుడి భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం

మహానంది: మహానంది నుంచి నంద్యాలకు వెళ్లే మార్గంలో గురువారం పెద్ద ప్రమాదం తప్పింది. గురువారం మహానంది నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను అల్లీనగరం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న మహారాష్ట్రకు చెందిన తుఫాను వాహనం టైరు పంక్చర్ అవ్వడంతో ఢీకొంది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ బాషా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. అదృష్టవశాత్తు ఆటోలో ఉన్నవారు, తుఫాన్ వాహనంలో ఉన్నవారు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం



శివపురం, గోకవరం గ్రామాలలో ఎన్నికల బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్

కొత్తపల్లి: మండలంలో జరిగే నీటిసంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. గురువారం మండలంలోని గోకవరం, కొత్తపల్లి, గువ్వలకుంట్ల, శివపురం గ్రామాలలోని పోలింగ్ బూత్‌లకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఆయకట్టు గ్రామాలలో నీటిసంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండలంలోని ఆయా సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎంపీడీఓ దశరథరామయ్య అధ్యక్షతన ఎన్నికల అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 14న ఉదయం 10 గంటలకు సాగునీటి సంఘం ఎన్నికలు నిరహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిశోర్ కుమార్ రెడ్డి, ఏఓ పీరునాయక్, కార్యాలయ ఏఓ సురేష్ కుమార్, ఈఓఆర్డీ సంజన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష ఎన్నిక

పగిడ్యాల: మండలంలోని డబ్ల్యూఏ-4 పరిధిలోని ముచ్చుమర్రి, పగిడ్యాల, ప్రాతకోట, లక్ష్మాపురం టీసీలకు సంబంధించిన నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష ఎన్నిక ఈనెల 14న ఉంటుందని తహసీల్దార్ శివరాముడు, ఎన్నికల అధికారి ఈఓఆర్డీ నాగేంద్రయ్య తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఈఓఆర్డీ నాగేంద్రయ్య అధ్యక్షతన ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ఓటర్లకు అవగాహన కల్పించకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు?

కొత్తపల్లి: నీటిసంఘాల ఎన్నికలపై ఓటర్లకు అవగాహన కల్పించకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని జెడ్పీటీసీ సభ్యుడుసోమల సుధాకర్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. గురువారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. మండలంలో 4000 మందికి పైగా రైతులు నీటీ సంఘాల ఎన్నికలలో వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. అయితే అధికారులు ఈ ఎన్నికలపై వారి ఎటువంటి అవగాహన కల్పించకపోవడంతో అస్సలు నీటిసంఘాల ఎన్నికలు ఉన్నాయా అన్న సందిగ్ధంలో రైతులు ఉన్నారన్నారు. ఓటర్లు ఏవిధంగా ఓటు వేయాలి, ఏ బూత్‌లలో ఓటువినియోగించుకోవాలి అన్న విషయాలను ఓటర్లకు అవగాహన కల్పించకుండా అధికారలు ఎన్నికల ఏర్పాట్లు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని వినూత్న నిరసన

- విద్యుత్ బిల్లులు తగలబెట్టిన సీపీఎం నాయకులు



విద్యుత్ బిల్లులు తగులబెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు పక్కీర్‌సాహెబ్



విద్యుత్ బిల్లులను కాల్చి నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు



కరెంటు బిల్లులకు నిప్పుపెడుతున్న సీపీఎం నాయకులు

పగిడ్యాల: విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రం పగిడ్యాలలో సీపీఎం నాయకులు వినూత్న నిరసన తెలిపారు. ఈ మేరకు బస్టాండ్‌లో సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లుల తగులపెట్టి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తామంటే ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని నానా హైరానా చేశారని, ఇప్పుడు ఇష్టారాజ్యాంగ ప్రజలపై పన్నుల భారం మోపడం ఏమిటని విమర్శించారు. అక్టోబర్‌లో రూ. 368 బిల్లు వస్తే ట్రూ ఆఫ్ చార్జీలు, ఎల్రక్టిసిటీ సర్దుబాటు చార్జీల పేరుతో పది యూనిట్లు తగ్గినప్పటికీ బిల్లు మాత్రం రూ.586 వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకురాలు గంధం ఉసేనమ్మ, వ్యవసాయ సంఘం నాయకురాలు ఈశ్వరమ్మ, మద్దమ్మ, తిక్కస్వామి, బీరమ్మ, సామేలు, చెంచమ్మ, నాగమ్మ, పుష్పావతి పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

ఆత్మకూరు: రాష్ట్ర కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజలపై భారం మోపిందని, వెంటనే విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, వీరన్న డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని గరీబ్‌నగర్, ఏకలవ్యనగర్, అర్బన్ కాలనీ, గొల్లపేట ఏరియాల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ విద్యుత్ ట్రూఅప్ చార్జీలు, ఇంధనపు చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో 40 శాతం ప్రజలపై భారాలు మోపిందన్నారు. చిన్నషాపు యజమాని గత నెలలో రూ.600 కడితే ఈనెల రూ.1100 వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిలార్, కిరణ్, దానమ్మ, సువర్ణమ్మ, చిన్నవలి, లక్ష్మీదేవి, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తు కరెంటు బిల్లులకు నాయకులు నిప్పు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పెంచడం ఎంత వరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, నాగన్న, ఉస్మాన్‌బాషా, రషీద్, నాయుడు, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి:ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేయడం మానుకుని వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు సత్యరాజు, రేజేష్‌లు డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర పిలుపు మేరకు గురువారం శివపురం గ్రామంలో పెంచిన విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్, నారాయణ, సిసింద్రీ, పుల్లన్న, వెంకటన్న, శివ తదితరులు పాల్గొన్నారు.